# * కొత్తరచయితలు

# లవ్ స్టోరీ

## 'ప్రియంవద'

**ప్రియంవదతో గడిపిన మధుర క్షణాల్ని నెమరు వేసుకుంటూ ఆమెను వదలి దూరంగా వెళు తున్నానన్న బాధతో బరువెక్కిన గుండెతో రైలు పెట్టెలోకి అడుగు పెట్టాను.**

మొట్టమొదటి నుండి నాకు అందగాడి నని గర్వం. ఎత్తైన నుదురు, చిన్ని కళ్ళు, అందమైన ముక్కు, పాల బుగ్గలు, చెరగని క్రాపు, చెదరని నవ్వు ఇవన్నీ నాకు అందాన్ని తెచ్చాయని నా నమ్మకం. నా చిన్నప్పుడు మా బడిలో అమ్మాయిలు, అబ్బాయిలందరినీ వదిలేసి, నన్ను వాళ్ళ జట్టుల్లో చేర్చుకొని, ఆటలాడినప్పుడు, వాళ్ళు వేసే ముగ్గులు నాకు నేర్పినప్పుడు, వాళ్ళేం కొనుక్కొన్నా తెచ్చుకొన్నా, నాకోసం దాచి ఇచ్చినప్పుడు, నిజంగా నాకు చాలా గర్వంగా వుండేది. ముఖ్యంగా ఆ రోజుల్లో నా చిన్ననాటి స్నేహితురాలు 'ప్రియంవద' చూపే ఆదరణ నన్నెంతో ముగ్ధుణ్ణి చేసేది.

'ప్రియంవద' ఆ పేరు తలచుకుంటేనే మదిలో ఏదో తియ్యని పులకింత. 'ప్రియం వద'తో కలసి, మావూరి శివాలయంలో ఆడుకున్న ఆటలు, పాడుకున్న పాటలు, వెన్నెలలో దేవాలయం మెట్లమీద కూర్చొని చెప్పుకున్న కబుర్లు, నా జీవితంలో మరువరానివి. తనంటే నాకు అపారమైన ప్రేమ. నేనంటే ఆమెకు అలివిమాలిన అనురాగం. అతి చిన్న వయస్సులోనే మా ఇద్దరి మధ్య ఏదో తెలియరాని బంధం ఏర్పడ్డది. నాకు తెలియకుండానే, నా చిన్నారి మనస్సులో ఆమెకో మహోన్నతమైన స్థానం ఇచ్చాను.

మావూరి వీధి బడిలో మొదలైన నా చదువు, హైస్కూలు చదువు వరకు ఆమె ఆట పాటల మధ్య మధురంగా గడిచింది. ఆ తరువాత నేను పై చదువులకు పట్నం రావడంతో, మా ఇద్దరి మధ్య తాత్కాలికంగా, దూరం ఏర్పడ్డా, సెలవలు వచ్చినప్పుడల్లా మా వూరు వెళ్ళి ఆమెను కలిసే వాడిని. పట్నం కబుర్లతో ఆమె సన్నిధానంలో ఎంతో మధురంగా గడిపేవాడిని. పెరిగే వయస్సుతోపాటు ఆమె మీద ప్రేమ నాలో రెట్టింపు అయ్యింది.

కాని విధి నా జీవితంలో చాలా విచిత్రమైన విన్యాసాలు చేసింది. నేను డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతుండగా, ఆమె పెళ్ళి జరిగిపోయింది. ఆ రోజు నాకు బాగా గుర్తుంది. జీవితంలో మొట్ట మొదటిసారిగా నా గుండె బ్రద్దలయిన రోజు, నా




ఎన్.వి.రమణారావు

డోర్ నెం. 12-191-1
బుగ్గావారి వీధి చివర
రేణిగుంట
చిత్తూరు జిల్లా


గుండె ముక్కల్లో ఆమె ప్రతిబింబం అస్తవ్యస్తంగా అగుపించిన రోజు — ''ఆమె పెళ్ళి రోజు'' ఆమె పెళ్లి శుభలేఖ చూశాను. గుండెను ఎవరో కత్తితో కోసినట్లుగా, భయంకరమైన, భరించరాని బాధ. నా హృదయేశ్వరి, మరొకరి భాగస్వామి అవుతుంటే, నా నోట మాట రాలేదు. ''అలా జరగడానికి వీలు లేదు - అలా జరగడానికి వీలు లేదు'' అని గొంతు చించుకొని గట్టిగా అరవాలనిపించింది. కాని అరవలేదు. కారణం ఆ పెండ్లి ఆపించడానికి నాకు వయస్సులేదు. అంతకుమించి ఆర్థిక స్వతంత్రం లేదు. అందుకే గుండెలో ఉప్పెనలు పొంగుతుంటే మెదడులో పిడుగులు గర్జన చేస్తుంటే, ఆగని అశ్రుధారలు తలగడను గడిపివేశాయి. ఆ రాత్రి అంతా ఎన్నో ఆలోచనలు... పెండ్లి కూతురిగా సింగారించుకొన్న నా హృదయేశ్వరిని ఒక్కసారిగా, కడసారిగా చూడాలని, బలమైన కోరిక. కాని ఇన్ని రోజులు నా హృదయ సామ్రాజ్యానికి రాణిగా వున్న ఆమె రేపటినుండి మరొకరిసొత్తు అనే భావన, కలిగిన తరువాత, ఆ కోరికను బలవంతాన చంపుకొన్నాను.

'ప్రియంవద'ను పూర్తిగా మరచిపోలేక పోయినా, కాలగమనంలో కొంత ఉపశమనం కలిగింది. డిగ్రీ పూర్తి అవ్వగానే ఉద్యోగంలో చేరాను. అమ్మా నాన్న పెళ్లి చేసుకోమని ఎంత బలవంతంచేసినా చేసుకోలేదు. 'ప్రియంవద' వదలివెళ్ళిన నా హృదయ సామ్రాజ్యంలో మరొకరిని రాణిగా వూహించలేకపోతున్నాను. ఇంకా ఆమెపట్ల ప్రేమ నా హృదయాంతరాలలో గూడుకట్టుకొని వున్నది. అందుకే ఆ స్థానం మరెవ్వరికీ ఇవ్వలేకపోయాను.

నాకు విజయవాడ ట్రాన్స్‌ఫర్ అయ్యింది. 'ప్రియంవద' కూడా నాళ్ళాయనతో ఉద్యోగరీత్యా విజయవాడలో వుంటుందని తెలుసు. అయితే ఎప్పుడుకూడా ఆమె చిరునామా గురించి ప్రయత్నించలేదు. కారణం నాలో పిరికితనం. ఆమెను మరొకరి భార్యగా చూడలేని తనం. కానీ ఆ ఊరు వెళ్ళిన తరువాత ప్రతి రోజు, ప్రతి చోట నా కళ్ళు నాకు తెలియకుండానే ఆమెను వెదుకుతుండేవి.

ఒక రోజు... హడావిడిగా ఆఫీసుకు బయలుదేరి బస్ స్టాప్ దగ్గర బస్‌కోసం వెయిట్ చేస్తున్నాను. టైముకురాని బస్ గురించి మనసులో తిట్టుకుంటూ గిరగిర తిరుగుతున్న టైమ్‌వైపు అసహనంగా చూసుకుంటూ వుండగా, దూరంగా... ఆమె...... నా హృదయరాణి, నా ఆరాధ్య దేవత. నా కలల ఊర్వశి... 'ప్రియం వద' వస్తోంది. దూరంగా నన్నుచూసి, ఒక్కసారిగా ఆమె ఆగిపోయింది. తదేకంగా నన్ను చూస్తూ మెల్లగా కదలి నావైపు రాసాగింది. ఆమె వచ్చే వైపు, కన్నులు ఆర్పకుండా, పిచ్చివాడిలా చూస్తున్నాను. నాకు ఆమె కళ్ళు తప్ప మరేమీ కనిపించడంలేదు. ఆమె నాకు దగ్గరగా వచ్చి ఆగింది.

''బాగున్నావా ప్రియా'' — ఇంతకుమించి, మరో మాట నా నోట పెగలలేదు. అలాగే ఆమె వైపు చూస్తున్నాను. ఆమె మాట్లాడలేదు. మౌనంగా తలవాల్చింది. ఆమె కళ్ళలో సన్నటి నీటి పొర... అలా మౌనంగా ఇద్దరం చాలాసేపు వున్నాము. మేము ఎక్కవలసిన బస్సులు రావడం, పోవడం జరిగింది. అది గమనించే స్థితిలో ఇద్దరం లేము. మొదటనేనే తేరుకొని అన్నాను. రోడ్డు ప్రక్కన వున్న పార్కుని చూపిస్తూ ''అలా కూర్చొని మాట్లాడుకొందామా'' అని. ఆమె


# లవ్ స్టోరీ

మౌనంగా నావెంట మంత్ర ముగ్ధురాలిగా నడచి వచ్చింది. చెట్టు కిందకు చేరాం. ఇద్దరి మధ్య మౌనం. తనే మెల్లగా చెప్పింది. తన భర్త ఇటీవల ఏక్సిడెంట్‌లో చనిపోయాడని, ఆయన గుర్తుగా ఒక బాబుని మిగిల్చిపోయాడని. ఆమె భర్త ఉద్యోగం, ఆమెకు వస్తే దానితో ఒంటరిగా, బాబుతో జీవితం వెళ్ళబుచ్చుతున్నానని. ఆమె కథ వినగానే మరోసారి నా గుండె బ్రద్దలయ్యింది. ఎంతో ఉన్నతంగా ఊహించిన నా కలల ఊర్వశి జీవితం ఇంత దారుణంగా మారింది అన్న వాస్తవాన్ని జీర్ణిచుకోలేక పోయాను. శిలాప్రతిమలా అలాగే కూర్చున్నాను. కొద్ది క్షణాలు, భయంకరమైన మౌనం మా ఇద్దరి మధ్య బాధతో నాట్యం చేసింది. టాపిక్‌ను మార్చాలని, కళ్ళు తుడుచుకుంటూ తనే మెల్లగా అడిగింది — "నువ్వు పెళ్ళి చేసుకున్నావా" అని.

"లేదు" ముక్తసరిగా సమాధానం ఇచ్చాను. ఆమె మౌనంగా కళ్ళెత్తి నావైపు చూసింది. మళ్ళీ అదే మౌనం మా ఇద్దరి మధ్య. మళ్ళీ ఆమె అంది. వాళ్ళ ఇంటి అడ్రసు ఇస్తూ "రేపు ఆదివారం తప్పకుండా మా ఇంటికి రావాలి" అని.

"అలాగే" అంటూ అక్కడినుండి కదిలాను. అనుకున్న ప్రకారం ఆ ఆదివారం ఆమె ఇంటికి వెళ్ళాను. ఆమె మనస్ఫూర్తిగా ఎన్నో విషయాలు చెప్పింది. నాతో మాట్లాడుతున్నప్పుడల్లా, ఆమె కళ్ళల్లో ఏదో వింత వెలుగు నాకు కనిపించింది. సాయంత్రం వరకూ అక్కడే వున్నాను. అలా ప్రతి ఆదివారం ఆమె ఇంటికి వెళ్ళడం నా జీవిత చర్యలో ఒకటయ్యింది. నా పిలుపువిని, తలుపు తెరచి, ఎదురుగా కనిపించే ఆమె కళ్ళల్లో ఏదో వింత వెలుగు. ఎంతో ఉత్సాహంగా, నవ్వుతూ, ఆప్యాయంగా లోపలికి రమ్మని పిలిచే ఆమె వెంట మంత్ర ముగ్ధుడిలా వెళ్ళే వాడిని. మళ్ళీ మామూలే... ఆమె సన్నిధానంలో నాకు కాలం ఎంతో వేగంగా పరిగెత్తేది. నాతో మాట్లాడుతున్నప్పుడు ఆమెలో క్రొత్త ఉత్సాహం పరవళ్ళు త్రొక్కు తుండేది. ఆమె నవ్వులో వాడిన గులాబీ మొక్కల విగుతింపు, ఉదయభానువి లేత కిరణాలలోని సింగారం చూపేవాడిని.

నిండు గోదావరిలా వుండే నా ప్రియంవద అలా పండుటాకులా-ఎండుటాకులా తిరగాడటం నేను భరించలేకపోయాను. ఆమె పట్ల జాలితో



అల్లల్లాడి పోసాగాను. 'నా ప్రియంవద అలా వుండటానికి వీల్లేదు' అని నాలో నేనే ఘర్షణ పడసాగాను. గతంలో ఆమె పట్ల నాకు అభిమానం-ప్రేమ అంతకుమించి ఆరాధనా భావం వున్నాయి. కాని ఇప్పుడు వాటన్నిటినీ మించి జాలి వుంది. ఆమె జీవితానికో అందమయిన ముగింపు ఇవ్వమని తొందర పెడుతోంది.

గుండెలోని నరాలు ఆమె పట్ల ప్రేమతో ఉప్పొంగుతుంటే, ఇన్ని రోజులు యెదలో దాచుకున్న ప్రేమ ఒక్కసారిగా పెల్లుబుకుతుంటే, జీరబోయిన కంఠంతో మెల్లగా చెప్పాను "నేను నిన్ను పెళ్లి చేసుకుంటాను" అని అంటూ ఆమెవైపు తిరిగాను. నా నిర్ణయానికి ఆమె ఎగిరిగంతేస్తుందని, ఉత్సాహంగా ఎగురుకుంటూ వచ్చి నా గుండెల మీద వాలిపోతుందని ఎంతగానో ఆశించిన నేను శిలా ప్రతిమలా కదలని ఆమెను చూసి ఆశ్చర్యపోయాను. ఆమె కళ్ళల్లో మళ్లీ సన్నటి నీటి పొర. గుండెల నుండి తన్నుకుని వస్తున్న ఆవేదనను, ముఖం మీదకు రానీయకుండా ఆమె చేసే ప్రయత్నంలో ఆమె అధరాలు సన్నగా వణకసాగాయి.

చాలాసేపు వరకు మళ్లీ మా ఇద్దరి మధ్య భయంకరమైన మౌనం. తరువాత తనను తానే సంబాళించుకుని ఆమె అడిగింది—"నా ఈ స్థితికి జాలిపడుతున్నావు కదూ" అని. "అవును" అన్నట్టుగా తలూపాను.

శిలలా స్తంభానికి ఆనుకుని పైకి పిచ్చిదానిలా చూస్తున్న ఆమె కొద్ది క్షణాల తరువాత తేరుకుని ఇలా అన్నది...

"రమణా! జీవితంలో ఎన్నో కామాలు, ఫుల్‌స్టాప్‌లు. సందర్భశుద్ధిగా వాడిన ప్రతి పంక్చువేషన్ మార్కు వాక్య నిర్మాణాన్ని నిర్దేశిస్తుంది. కొత్త అర్థాన్ని స్ఫురింపజేస్తుంది. నీవు జీవితంలో భాగస్వామిని కోరుకుంటున్నావు. ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించు - ఆమె అభిప్రాయాల్ని అర్థం చేసుకో. అంతేగాని జాలిపడి నీ జీవితంలో చోటివ్వకు. నాకు తెలుసు, నేనంటే నీకు చాలా ఇష్టమని. కృష్ణుడు రాధని ఇష్టపడ్డాడు, సత్యభామని-రుక్మిణిని కూడా ఇష్టపడ్డాడు. ద్రౌపదిని కూడా అభిమానించాడు. ఒక రోజున అర్థక అస్వతంత్రత వలన నీ మనసులోని మాటని నిర్భయంగా చెప్పలేకపోయావు. ఈ రోజున నీకు ఏం కావాలో తెలుసుకోలేక ఒకదానికి



మరొకటి పొరబడి మాట్లాడుతున్నావు. నీకు భార్య కావాలి. అయితే జాలిపడి ఎవరికో ఆ స్థానం ఇవ్వకు. జాలితో ఇచ్చేది దానమవుతుంది. కాని భార్య కోరుకునేది హక్కు."

ఆమె మాటలతో నిరుత్తురుడనయ్యాను. చివరకు నన్ను నేను సంబాళించుకుని, "ప్రియా! నీవు ఆ ప్రియవేనా - చాలా ఎదిగావు" అన్నాను.

"ఆలస్యంగా గుర్తించావు రమణా - జీవితంలో కొందరి పరిచయం కొన్ని అనుభూతుల్ని మిగుల్చుతుంది. నీవు జీవితంలో తొలిమెట్టు మీదున్నావు. కాని నేను ఎన్నో అనుభూతుల్ని చవి చూశాను. నీకు ప్రతిదీ థ్రిల్లింగ్‌గానే వుంటుంది. నేనే నీ భార్యనయితే కొన్ని విషయాలలో టీచర్ని, గైడ్‌ని కూడా అవుతానేమో! ఆ స్థితిని తట్టుకోదగ్గ మానసిక పరిపక్వత నీకు లేదు. అందువలన నన్ను ఓ స్నేహితురాలిగానే గుర్తు పెట్టుకో... ఇతర్రతా ఆలోచించకు" అన్నది.

ఓడిపోయాను. మరోసారి ఘోరంగా ఓడి పోయాను.

గతంలో నా ఓటమికి ఓ కారణం వుంది. కాని ఈ ఓటమికి నేనే కారణం.

ఆ క్షణంలో నేనేమీ మాట్లాడలేకపోయాను. నాకు తెలియకుండానే నా కళ్లవెంట నీరు రాసాగింది. ఎంత తమాయించుకుందామన్నా దుఃఖం ఆగడం లేదు. భారమైన గుండెతో ఒకే ఒక మాట అన్నాను.

"పిరికివాళ్ల ప్రేమించకూడదు ప్రియా" అని. ఆ మాటలు ఆమె విన్నదో లేదో తెలియదు. ఇహ అక్కడ వుండలేకపోయాను. అందుకే మెల్లగా అన్నాను. "వెళుతున్నాను ప్రియా! నువ్వు ఎక్కడ వున్నా సుఖంగా వుండటమే నాకు కావలసింది. జీవితంలో నీకే కష్టమొచ్చినా ఆదుకోవడానికి, నేను బ్రతికే వున్నాననే విషయం మరచిపోవద్దు. మరు జన్మ ఎంత తొందరగా వస్తుందని ఎదురుచూస్తూ, ఈ జన్మంతా నీ మధుర స్మృతులతో గడిపేస్తాను" అంటూ బయటకు నడిచాను.

◆